
సాక్షి బాపట్ల

ఆదివారం । 12 । జనవరి । 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 80 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా కూడారై ఉత్సవం

ఫిరంగిపురం: స్థానిక గీతా మందిరంలో శనివారం కూడారై ఉత్సవం నిర్వహించారు. 108 చిన్న కుండీలలో ప్రసాదాలు ఏర్పాటుచేశారు. గోదారంగనాథ చిత్రం వద్ద దీపాలు వెలిగించారు.



ఘనంగా వేంకటేశ్వర కల్యాణం

అచ్చంపేట: స్థానిక హరిహరక్షేత్రంలోని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం రాత్రి ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.

కుదేలైన వ్యాపారం

వెలవెలబోతున్న దుకాణాలు

- ఆర్థిక ఇబ్బందుల్లో పేద, మధ్యతరగతి ప్రజలు
- గిట్టుబాటుధర రాక నష్టపోయిన రైతులు, కౌలుదారులు
- గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు రద్దు
- ఆర్థికంగా చేయూతనివ్వని కూటమి సర్కారు
- కొనుగోలు శక్తి పడిపోవడంతో చితికిన వ్యాపారులు
- గ్రామాలలో కళతప్పిన సంక్రాంతి



రేపల్లెలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వస్త్ర దుకాణం



రేపల్లెలో కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న కిరాణా దుకాణం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సంక్రాంతి పండుగ వచ్చిందంటే వస్త్ర దుకాణాలు...కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటాయి. కానీ ప్రస్తుతం దుకాణాలన్నీ కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. ఐదేళ్ల వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందుకున్న పేద, మధ్యతరగతి ప్రజలు సుఖ సంతోషాలతో గడపగా ఏడు నెలల చంద్రబాబు సంక్షోభ పాలన ప్రజలను కష్టాల్లోకి నెట్టి సంక్రాంతి పండుగ సంబరాలకు దూరం చేసింది. ఆర్థికంగా చేయూత లేక ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. తద్వారా అన్ని రకాల వ్యాపారాలు దివాళా తీసి వ్యాపారులు చితికిపోయారు. దీంతో కొత్త ఏడాది సంక్రాంతి సంబరాలు వెలవెలబోతున్నాయి.

రైతుకు ఏదీ భరోసా!

గతంలో సంక్రాంతి నాటికి కొత్త పంట రైతు ఇంటికి చేరేది. కొత్త ధాన్యంతో పొంగలి చేసేవారు. అంతేగాక ధాన్యం అమ్మగా ధనలక్ష్మి చేతికి చేరేది. ఇంటిల్లపాది నూతన వస్త్రాలు కొనుగోలు చేసి పండుగను ఆనందంగా జరుపుకునేవారు. గత ఐదేళ్ల సంక్రాంతి నాటికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం రైతుకు భరోసా ఇవ్వలేకపోయింది. దీనికితోడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న ధాన్యం కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో నష్టాలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఫలితంగా రైతు కుటుంబాల్లో పండుగ కళ తప్పింది.

సంతోషంగా పండుగ ఎలా చేస్తాం..



ఈ ఏడాది 15 ఎకరాల్లో వరి సాగుచేశా. బస్తా ధాన్యం రూ.1350కి అమ్మాం. పెట్టుబడులు కూడా సక్రమంగా రాలేదు. గతేడాది బస్తా ధాన్యం రూ.1800 అమ్మాం. ఈ పరిస్థితుల్లో సంక్రాంతి పండుగ సంతోషంగా ఎలా చేసుకోగలం.

– అల్లూరి యోన, రైతు, జంపని, వేమూరు మండలం

వ్యాపారాలు లేవు



వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. గతేడాది పండుగ సీజన్‌లో రోజుకు రూ.5 నుంచి రూ. 10 వేల వరకూ వ్యాపారం జరిగేది. ఇప్పుడు రోజుకు రూ. 2 వేల వ్యాపారం కూడా జరగడంలేదు. ఆరు నెలలుగా వ్యాపారాలు తగ్గాయి. తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నాం.

– షేక్ మస్తానమ్మ, పండ్ల వ్యాపారి, బాపట్ల

వ్యాపారాలు అంతంత మాత్రమే

చాలా కాలంగా కిరాణా దుకాణం నడుపుతున్నాం. సంక్రాంతి పండుగకు కనీసం 15 రోజుల ముందు నుంచి బిజీగా ఉండేవాళ్లం. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది వ్యాపారాలు మందకొడిగా ఉన్నాయి. ఆరు నెలల నుంచి వ్యాపారాలు భారీగా తగ్గాయి. గతంలో రోజుకు రూ.16వేల నుంచి రూ.18వేల వరకు విక్రయాలు జరిపేవాళ్లం. ప్రస్తుతం రూ.10వేలు కూడా అమ్మలేకపోతున్నాం. సీజన్‌లోనే ఇలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందోనని భయంగా ఉంది.

–బి.రామకృష్ణ, ఓల్డ్‌టౌన్, రేపల్లె

వ్యాపారాలు తగ్గాయి..



ప్రతి ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వరుస పండుగలకు వస్త్ర వ్యాపారం బాగుండేది. పండుగల సందర్భంగా వ్యాపారులు కూడా ముందుగా వస్త్రాలను ఎక్కువగా కొనుగోలు చేసేవారు. కస్టమర్లు కూడా ఎక్కువగా కొనుగోళ్లతో వ్యాపారం బాగుండేది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. వస్త్ర వ్యాపారం ఈ ఏడాది డీలా పడింది.

– వేముల చంద్రశేఖర్, ఎంజీసీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, చీరాల

న్యూస్‌రీల్

వడ్డే ఓబన్నను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



బాపట్ల: స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న వడ్డే ఓబన్నను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. బ్రిటిష్ పాలకులు రైతుల నుంచి శిస్తు వసూలుకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి ఓబన్న పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



బాపట్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మున్సిపల్ హైస్కూలులో శనివారం ఉదయం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈపోటీలను ఉద్దేశించి విన్నకోట సురేష్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా విద్యార్థులు ముందుకుపోవాలని సూచించారు. ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. కత్తి శ్రీనివాసరావు, కాకి రమేష్, తిరుమలశెట్టి సాంబు, సుబ్బరాజు, ఉమ్మారెడ్డి వెంకట రమారావు, మధు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

15వ రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన



బాపట్ల: సంక్రాంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అలపర్తి ఎన్‌క్లేవ్, మచ్చవారి పాలెం రోడ్డులో 14న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన ప్రారంభమైందని కమిటీ అధ్యక్షుడు లేళ్ళ నరేంద్ర తెలిపారు. ఈమేరకు భీమావారిపాలెం శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లేళ్ల నరేంద్ర మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఎడ్ల బలప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. ఎడ్ల బలప్రదర్శనలో పాల్గొనదలచిన యడ్ల యజమానులు సోమవారం తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. మొదటి విభాగం, ద్వితీయవిభాగం ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కమిటీ సభ్యులు రౌతు రాము, ఆళ్ల ఆంజనేయులు, కారుమూరి ఆంజనేయస్, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం నుంచి అన్నంబొట్లవారిపాలెంలో బండలాగుడు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహించే 37వ జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఈ నెల 17వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 13వ తేదీన పెద్ద సైజు విభాగంలో, 14వ తేదీన జూనియర్స్ విభాగంలో, 15వ తేదీ సబ్ జూనియర్స్ విభాగంలో, 16వ తేదీన సేద్యపు విభాగంలో, 17వ తేదీన పాలపళ్ల విభాగంతోపాటు ఆవుల అందాల పోటీలు కూడా జరుగుతాయని తెలిపారు. 13న జరిగే పెద్ద సైజు విభాగం పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.1.50 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.60 వేలు, నాలుగో బహుమతి రూ.36 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.15 వేలు, ఏడో బహుమతి రూ.10 వేలుగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

అధికార లాంఛనాలతో

ఏఎస్‌ఐకి కన్నీటి వీడ్కోలు



సంపూర్ణరావు శవపేటికను మోస్తున్న ఏఆర్ డీఎస్పీ విజయసారథి, పోలీసులు



గాల్లోకి మూడు రౌండ్లు కాలుస్తూ గౌరవ వందనం చేస్తున్న ఏఆర్ పోలీసులు

- పాడె మోసి వీడ్కోలు పలికిన డీఎస్పీలు, సీఐలు
- మట్టి ఖర్చులకు పోలీసు శాఖ నుంచి రూ.25 వేలు అందజేత

చీరాల టౌన్: విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్‌ఐ మేడిద సంపూర్ణరావు (58) అంతిమ వీడ్కోలు పోలీసు అధికారులు లాంఛనాలు, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఏఆర్ ఏఎస్‌ఐ సంపూర్ణరావు వాహనాన్ని దొనకొండ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కారు ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మరణించారు. పోస్టుమార్టం అనంతరం సంపూర్ణరావు మృతదేహాన్ని వాడరేవు రోడ్డులోని గాంధీనగర్ స్వగృహానికి తరలించారు. శనివారం అధికార లాంఛనాలతో వీడ్కోలు పలికారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ పీ విజయసారథి, చీరాల డీఎస్పీ మోయిన్‌లు సంపూర్ణరావు మృతదేహాన్ని మోసి పోలీస్ శాఖకు సంపూర్ణరావు చేసిన సేవలు కొనియాడి కన్నీటి పర్యంతమయ్యారు. మృతిచెందిన ఏఎస్సై స్వగృహం నుంచి సమాధుల తోట వరకు పోలీసులు శవ పేటికను మోశారు. అనంతరం ఏఆర్ డీఎస్పీ విజయసారథి నేతృత్వంలోని ఏఆర్ పోలీసులు గౌరవ సూచికంగా గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి సంపూర్ణరావుకు తుది వీడ్కోలు పలికారు. బాపట్ల ఎస్పీ కార్యాలయంలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న సంపూర్ణరావు మృతదేహాన్ని చీరాల పట్టణం, రూరల్ సీఐలు శ్రీనివాసరావు, శేషగిరిరావు, నాగభూషణం, ఏఆర్ సీఐలు మౌలుద్దీన్, శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు సంపూర్ణరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రైస్తవ సంప్రదాయం ప్రకారం సమాధుల తోటలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం ఏఆర్ డీఎస్పీ సంపూర్ణరావు కుటుంబ సభ్యులకు పోలీస్‌శాఖ నుంచి మట్టి ఖర్చులకు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. పోలీస్ శాఖ నుంచి రావాల్సిన సౌకర్యాలు త్వరగా అందించడంతో పాటుగా ఏఎస్‌ఐ మృతికి కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



సొంతూరుకు చలో..చలో !

ఏపీఎస్ ఆర్టీసీ సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈనెల 9 నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడం, రెండో శనివారం నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు సైతం సెలవులు రావడంతో భారీగా పట్టణాల నుంచి పల్లెలకు బస్సులు తరలి వెళుతున్నాయి. ప్రయాణికుల రాకపోకలతో గుంటూరు బస్టాండ్ ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఈనెల 9, 10, 11, 12 తేదీల్లో భారీగా ఆర్టీసీకి ఆదాయం చేకూరనుంది. నిత్యం 40 నుండి 50వేల మంది ఆర్టీసీ ద్వారా వారి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పండుగ నేపథ్యంలో సుమారు లక్ష మంది గుంటూరు రీజియన్ పరిధిలోని గుంటూరు-1,2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల ద్వారా ఆయా ప్రాంతాలకు చేరుకుంటున్నారు. మామూలు రోజుల్లో ఆర్టీసీ ఆదాయం రూ.50 లక్షలు వస్తోంది. పండుగను పురస్కరించుకుని రద్దీ భారీగా ఉండటంతో రూ.70 లక్షల మేర ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా గుంటూరు రీజియన్‌లోని ఆయా డిపోలకు చేరుకునేందుకు హైదరాబాద్, బెంగళూరు, వైజాగ్, చెన్నై, ఇతర ప్రాంతాల నుంచి 150 బస్సులను ఇప్పటికే ఏర్పాటుచేశారు. పండుగ అనంతరం తిరుగు ప్రయాణానికి తగ్గట్లు బస్సులను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. – పట్నంబజారు(గుంటూరుఈస్ట్)

ఉత్కంఠభరితంగా రాష్ట్రస్థాయి టీ–20 పోటీలు

- చెన్నై జట్ల విజయం
- నాటౌట్‌గా నిలిచిన ఎస్ఎన్ఆర్‌సీ, చెన్నై జట్టు కెప్టెన్ మిచెల్



తలపడుతున్న థండర్ బోల్ట్స్ తిరుపతి–ఎస్ఎన్ఆర్‌సీ చెన్నై జట్లు

మేదరమెట్ల: హోరాహోరీగా జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టీ–20 పోటీలు తుదిదశకు చేరుకున్నాయి. రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతలలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్–2025 పోటీల్లో భాగంగా శనివారం నిర్వహించిన రెండు మ్యాచ్‌ల్లో చెన్నై జట్లు విజయం సాధించాయి.

10 పరుగుల తేడాతో ఎస్ఎన్ఆర్‌సీ విజయం

ఉదయం జరిగిన మ్యాచ్ ఇండియన్ బ్యాంక్ ఎస్ఎన్ఆర్‌సీ (చెన్నై), థండర్ బోల్ట్స్ లెవెన్ (తిరుపతి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన థండర్ బోల్ట్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ఆరంభించిన ఇండియన్ బ్యాంక్ ఎస్ఎన్ఆర్‌సీ చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసింది. ఈ జట్టులో ఓపెనర్ సంజయ్ శ్రీనివాస్ 43 బంతుల్లో 3 ఫోర్ల సాయంతో 43 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ కెప్టెన్ మిచెల్ 36 బంతుల్లో 5 ఫోర్లు ఒక సిక్స్ సాయంతో 47 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. థండర్ బోల్ట్స్ బౌలర్ అచ్యుతానంద్ 4 ఓవర్లు బౌల్ చేసి 14 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. 126 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన థండర్ బోల్ట్స్ తిరుపతి జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 115 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ జట్టులో ఎస్‌వీ రాహుల్ 46 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 43 పరుగులు సాధించాడు. మరో బ్యాట్స్‌మెన్ తేజారెడ్డి 24 బంతుల్లో 3 సిక్స్‌లతో 31 పరుగులు చేశాడు. చెన్నై జట్టులో బౌలింగ్ చేసిన ప్రతి బౌలర్ చెరో వికెట్లు తీసి ప్రత్యర్థిని ఆలౌట్ చేశారు. దీంతో పది రన్స్ తేడాతో ఇండియన్ బ్యాంక్ ఎస్ఎన్ఆర్‌సీ చెన్నై జట్టు విజయం సాధించింది.

8 వికెట్ల తేడాతో ఎస్కేఎంసీసీ విజయం..

మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ (విజయవాడ), ఎస్‌కేఎంసీసీ (చెన్నై) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన విజయవాడ రైల్వేస్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ ఆరంభించిన విజయవాడ జట్టు 15.4 ఓవర్లలో 51 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. చెన్నై బౌలర్లు గణేష్, సూర్య, శంకర్ తలా రెండు వికెట్లు తీశారు. 52 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన చెన్నై జట్టు కేవలం 4.5 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ హిమాలయ 11 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్‌తో 31 పరుగులు చేసి జట్టు విజయం సులభతరం చేశాడు. దీంతో 8 వికెట్ల తేడాతో చెన్నై జట్టు విజయవాడ జట్టుపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లకు అంపైర్లుగా శ్రీనివాస్, రాజు స్కోరర్‌గా సాయిరాజ్ వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

ఉదయం మ్యాచ్ సౌత్‌జోన్ సీసీ (చెన్నై)–లైన్స్ సీసీ (బెంగళూరు) జట్ల మధ్య, మధ్యాహ్నం మ్యాచ్ జీఎస్‌టీ అండ్ సీఈ లెవెన్ (చెన్నై)–వైట్‌ఫీల్డ్ సీఏ లెవెన్ (బెంగళూరు) జట్ల మధ్య పోటీలు జరుగనున్నాయి.

పొన్నూరు విచ్చేసిన ఒడిశా గవర్నర్ హరిబాబు



పొన్నూరు: ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు శనివారం పొన్నూరు వచ్చారు. నిడుబ్రోలుకు చెందిన కేంద్ర మాజీ మంత్రి పాములపాటి అంకినీడు ప్రసాదరావు సతీమణి శివప్రసాదదేవి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవికి పూజలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస కార్యక్రమాలలో శనివారం 27వ రోజు 27వ పాశురాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ శాసనాలతో కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది భక్తులు గోదా అమ్మవారికి సారెను సమర్పించి స్వామి వారి మంగళాశాసనాలు అందుకున్నారని పేర్కొన్నారు. కూడారై (పాయసం) మహోత్సవం అత్యంత వైభవంగా జరిగిందని చెప్పారు.

ప్రాభవం కోల్పోతున్న హరిదాసులు

- గ్రామాల్లో కనుమరుగవుతున్న సంక్రాంతి సంబరాలు
- పురాణాలలోను హరిదాసులకు గొప్ప విలువలు



ఇంటముంగిటకు వచ్చిన హరిదాసు

చినగంజాం: సంక్రాంతి పండుగ వస్తుందంటే ముత్యాల ముగ్గులు, ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాలు, పొష్యలక్ష్మికి స్వాగతం పలుకుతూ పండుగ అత్యంత ఆహ్లాదంగా సాగిపోతుంది. యువకుల గాలిపటాలు, యువతుల రంగుల రంగవల్లుల పండుగను శోభాయమానంగా మురిపిస్తాయి. సంక్రాంతి పండుగకు నెల రోజులు ముందుగా ప్రారంభమయ్యే ధనుర్మాసం నుంచే హరిదాసులు శ్రీకృష్ణ లీలామృతాన్ని గానం చేసుకుంటూ, హరిలో రంగ హరి అంటూ నడి నెత్తిపై నుంచి తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లు మంటూ చిందులు తొక్కుతూ, తలపై రాగి అక్షయపాత్ర, ఒకచేత్తో చిడతలు, మరో చేత్తో తంబూర మీటుతూ గ్రామ వీధుల్లో సంచరిస్తూ ఉంటారు.

అసలు హరిదాసులు అంటే ఎవరు?

హరిదాసులు మూడు వర్గాల వారు ఉండగా వారిలో హరిదాసు పేరుతో హరికథలను చెప్తూ ఉండేవారు మొదటి వర్గం కాగా, కర్ణాటక ప్రాంతంలో హరి దీక్ష తీసుకొని భజన, గానం, నృత్యం ద్వారా హరి నామాన్ని వ్యాప్తి చేసేవారు రెండో వర్గానికి చెందిన వారు. మూడో వర్గం వారు కార్తిక మాసం, సంక్రాంతి రోజులలో గ్రామాల్లో భిక్షాటన చేసేవారు.

హరిదాసుల రాకతో పల్లెల్లో సంక్రాంతి శోభ

హరిదాసు రాకతో గ్రామాలలో సంక్రాంతి శోభ సంతరించుకుంటుంది. ధనుర్మాస నెల ప్రారంభం నుంచి చాత్తాద శ్రీవైష్ణవ మతానికి చెందిన హరిదాసులు తమదైన శైలిలో వేషధారణ చేసుకొని, తమ మధురమైన గానామృతంతో ఆలపిస్తూ గ్రామాలలో తిరుగుతుంటారు. హరిదాసులు వస్తున్నారంటే చిన్నారులలో సందడే సందడి. బియ్యం, పప్పులు, చింతపండు, కూరగాయలతో పాటు తాము పండించిన పలు వస్తువులను ఇస్తూ ఉంటారు. హరిదాసు తలపై ఉండే రాగి అక్షయ పాత్రలో వాటిని ఉంచితే కృష్ణునికి వాటిని సమర్పించినట్లు భావిస్తారు. ఆ సమయంలో హరిదాసులు కృష్ణార్పణం అని ఉచ్చరిస్తూ చిన్నారులను ఆశీర్వదిస్తారు. ఆనాటి నుంచి ప్రతి ఇంటిలోనూ సంక్రాంతి పనులు ప్రారంభమవుతాయి.

అక్షయపాత్ర విశిష్టత

అక్షయ అనగా ఎప్పుడు నిండుగా ఉండేది అని అర్థం. పాండవుల వనవాస సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఈ అక్షయ పాత్ర ఇచ్చినట్లు, పట్టాభిషేకం సమయంలో అక్షయ పాత్రను ఎవరికివ్వాలనే సందిగ్ధంలో ఉన్న ధర్మారాజుకు శ్రీకృష్ణుడు సమాధానమిస్తూ వేయి గంటల మండపాన్ని నిర్మాణం చేసి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలని ఆ సమయంలో గంటలు మోగాలని సూచించినట్లు పురాణ కథనం. ధర్మరాజు ఆవిధంగా చేసినప్పటికీ గంటలు మోగక పోవడంతో, శ్రీకృష్ణుడిని ప్రార్థించగా చాత్తాది శ్రీవైష్ణవునికి భోజనం పెట్టమని ఆదేశించాడు. చాత్తాది శ్రీవైష్ణవుడు భోజనం వలదని స్వయంపాకం ఇమ్మని కోరి, దానిని తీసుకొని వెళ్లి వండి శ్రీకృష్ణునికి, గోదాదేవికి నివేదన చేసిన పిమ్మట అతడు భోజనం చేసిన అనంతరం గంటలు మోగినట్లు ప్రతీతి. అప్పుడు ధర్మారాజు అక్షయ పాత్రను చాత్తాది శ్రీవైష్ణవునికి దానం ఇచ్చినట్లు, నాటి నుంచి హరిదాసులు వంశపారంపర్యంగా కుల వృత్తిగా అక్షయ పాత్రను ధరించి గ్రామాల్లో సంచరిస్తున్నట్లు పురాణ కథ వాడుకలో ఉంది. వారి వంశాచారం ప్రకారం హరిదాసులు ధనుర్మాసం నెల రోజులలో సూర్యోదయానికి పూర్వమే శ్రీకృష్ణ గోదాదేవిలను పూజించి, తిరుప్పావై పఠనం జరిపి, అక్షయపాత్రను తలపై ధరించి గ్రామ సంచారం జరుపుతారు. గ్రామ సంచారం ప్రారంభం నుంచి తిరిగి ఇంటికి వెళ్లేవరకూ హరి నామ సంకీర్తన తప్ప, ఇతరులతో మాట్లాడక, అక్షయ పాత్రను కిందకు దింపకుండా నియమాన్ని పాటిస్తారు. తమ ఇంటికి వెళ్లిన అనంతరం ఇంటావిడ పాదాలు కడిగిన అనంతరం మాత్రమే అక్షయ పాత్రను కిందకు దించాలనే నియమం పాటిస్తారు. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో ఇంతటి ప్రాశస్త్యం కలిగిన హరిదాసులు తమ వైభవాన్ని కోల్పోతున్నారు. పూర్వం గ్రామాలలో తరచూ కనిపించే హరిదాసులు నేడు కనుమరుగవుతున్నారు.

క్లుప్తంగా

స్వాతంత్య్ర సమరయోధుడు ఓబన్న



చీరాల రూరల్: రేనాటి వీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలను శనివారం పట్టణంలోని హరిప్రసాద్ నగర్‌లో వల్లెపు వేణుబాబు ఆధ్వర్యంలో ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఓబన్న చిత్ర పటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఒడ్డే ఓబన్న వడ్డెరల జాతికోసం ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. జాతి కోసమే కాకుండా స్వాతంత్య్ర సమర యోధునిగా దేశం కోసం, దేశ క్షేమం కోసం అలుపెరగని పోరాటాలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కుంచాల చిన్న వెంకయ్య, గుంజి శ్రీనివాసరావు, బత్తుల ఏసు బాబు, చల్లా నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వర్ణలో క్రీడా సంబరాలు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో నూతన సంవత్సర, సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీన సచివాలయ ప్రాంగణంలో చెస్ పోటీలు జరుగుతాయన్నారు. 14వ తేదీన ఉదయం పెద్ద రైస్ మిల్లు వద్ద క్రికెట్ పోటీలు, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, సచివాలయ ప్రాంగణంలో వాలీబాల్ పోటీలు, సాయంత్రం వివేకానంద లైబ్రరీ వద్ద ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. 15వ తేదీన సచివాలయం వద్ద స్లో సైక్లింగ్, బైక్ స్లో పోటీలు, సాయంత్రం లాంగ్ జంప్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం లోపు సంఘం డైరీ దామోదర్ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి



మేదరమెట్ల: మైలురాయిని ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈఘటన దక్షిణ బైపాస్ వద్ద భ్రమర వెంచర్ సమీపంలో శనివారం తెల్లవారు జామున జరిగింది. అందిన వివరాల మేరకు.. మృతుడు లారీ డ్రైవర్ తమిళనాడు రాష్ట్రం సీతానగర్ పాలం ధర్‌పేటకు చెందిన కన్నియప్పన్ (45) భీమవరం నుంచి చెన్నైకు వెళ్తున్నాడు. ఈక్రమంలో లారీ అదుపు తప్పి మైలు రాయిని ఢీకొని లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కన్నియప్పన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

వేటపాలెం: గ్రామం శివారులో నిర్వహిస్తున్న కోడి పందెం శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మండల పరిధిలోని కఠారివారిపాలెం మత్స్యకార గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1000 నగదుతో 20 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సంక్రాంతి సందర్భంగా జూదాలు, కోడి పందేలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



కష్టపడిన నాయకులకు పార్టీలో ప్రాధాన్యం

- పార్టీ బలోపేతానికై సమష్టి కృషిచేయాలి
- పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి



ఇన్‌చార్జ్ మధుసూదన్ రెడ్డిని సత్కరిస్తున్న మార్టూరు నాయకులు

మార్టూరు: నియోజకవర్గంలోని అన్ని వర్గాలలో గణనీయమైన ఓటు బ్యాంకు కలిగిన వైఎస్సార్ సీపీ బలోపేతానికై నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టి కృషి చేద్దామని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో ఆయన స్వగృహంలో శనివారం కలిసిన మార్టూరు మండల పార్టీ నాయకులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తను త్వరలో కలుస్తానని పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండా మోసి అభివృద్ధికి దోహదపడిన వారికి పార్టీలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తానని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఎదురైనా అండగా ఉంటానని పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలన్నారు. తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. సంక్రాంతి అనంతరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులను కలుస్తానని రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ పఠాన్ కాలేషా వలి, సులేమాన్, ఎస్టీ నాయకుడు మోషే నాయక్, బీసీ నాయకులు రామస్వామి, సోడా బుడే తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సత్కరించి సన్మానించారు.

సందడిగా మారిన పావులూరు..

ఇంకొల్లు (చినగంజాం): నూతనంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన గాదె మధుసూదన్‌రెడ్డిని పలు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గ్రామం అంతా సందడి వాతావరణం నెలకొంది. అనంతరం ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఆయనను కలిసిన వారిలో నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, తోకల కృష్ణమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బాబుల్లా, మాచవరపు రవికుమార్, ఇంకొల్లు, కారంచేడు, మార్టూరు మండలాల కన్వీనర్‌లు బండారు ప్రభాకరరావు, దండా చౌదరి, నాయకులు నూతలపాటి బలరాం, సులేమాన్, కే బుల్లిబ్బాయి, భీమవరం సర్పంచ్ స్వామి, కుమ్మరి చందు, భవనం మల్లికార్జునరెడ్డి తదితరులున్నారు.

నిజమైన సమాచారం అందించాలి..

ప్రజలకు మేలు చేకూర్చే విలువైన సమాచారాన్ని నేరుగా వారికి అందించడమే సోషల్ మీడియా కర్తవ్యంగా పాటించి ముందుకు సాగాలని ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి సూచించారు. ఆయనను పార్టీ సోషల్ మీడియా కమిటీ సభ్యులు ఇన్‌చార్జ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రజా ప్రతినిధులకు, పార్టీ నాయకులకు ప్రజలకు మధ్య చక్కటి వారధిలా పనిచేయాలని, సరైన సమాచారాన్ని సకాలంలో ప్రజలకు నేరుగా చేర్చడమే సోషల్ మీడియా ముఖ్య ఉద్దేశ్యం కావాలన్నారు. సోషల్ మీడియాలో పనిచేసే సభ్యులు వ్యక్తిగత దూషణలు, రాజకీయ దూషణలు, వివాదాల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో

నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బట్టు అనిల్ కుమార్ యాదవ్ ఇన్‌చార్జ్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కో కన్వీనర్ కుమ్మరి చందు, చలమారెడ్డి, షేక్ వలి, రామ్, మండల కన్వీనర్‌లు పల్లెపోగు జగన్, యర్రం సుబ్బారెడ్డి, రావూరి పూర్ణ, గొర్రుముచ్చు సురేంద్ర, పటాన్ షరీఫ్, మస్తాన్, షరీఫ్, దుడ్డు వినోద్, ఎన్ రమేష్, వంశీ, జెట్టి వినోద్, సయ్యద్ సుభాని, అంజిరెడ్డి, ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డిని కలిసిన సోషల్ మీడియా సభ్యులు



మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నియోజకవర్గంలో పార్టీకి ఆదరణ తగ్గలేదు

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఎనలేని ఆదరణ ఉందని, దానిని ఓట్ల రూపంలో మలుచుకోవాలని చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన యాతం మేరిబాబు కరణం వెంకటేష్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ పార్టీకి పునర్వైభవం వస్తుందని, నాయకులు ఎలాగున్నా కార్యకర్తలు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉన్నారన్నారు. మేరిబాబుకు అభినందనలు తెలిపి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.



వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మేరిబాబు

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుల నియామకం

అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాలు, అద్దంకి పట్టణ అధ్యక్షుడిని, పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కేంద్ర కార్యాలయ వర్గాలు ఆయా పేర్ల జాబితాను ప్రకటించారు. అద్దంకి పట్టణ అధ్యక్షుడిగా కాకాని రాధాకృష్ణమూర్తి, మండల అధ్యక్షుడిగా గుజ్జుల ప్రకటించగా, వీరిద్దరూ ఇప్పటికే ఆయా పదవుల్లో కొనసాగుతున్నారు. సంతమాగులూరు మండల అధ్యక్షుడిగా ఉట్ల నాగేశ్వరరావు, బల్లికురవ మండల అధ్యక్షుడిగా దేవినేని కృష్ణబాబు, కొరిశపాడు మండల అధ్యక్షుడిగా పాలపర్తి శ్రీధర్ (చిట్టి), జే పంగులూరు మండల అధ్యక్షుడిగా రావూరి శ్రీనివాసరావు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా తమను ఆయా పదవుల్లో నియమించిన పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డికి, పార్టీ పెద్దలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



రావూరి శ్రీనివాసరావు



ఉట్ల నాగేశ్వరరావు



పాలపర్తి శ్రీధర్

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు సూచనలు అందిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

చీరాల రూరల్: ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణతో పాటు మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని 23 (ఏ) ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్ అన్నారు. ఎన్‌సీసీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్లో ఏ సర్టిఫికెట్ ఎగ్జామ్ నిర్వహించారు. సునీల్ గౌతమ్ పర్యవేక్షణలో డ్రిల్‌టెస్టు, ఫీల్డ్‌క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, ఫైరింగ్‌లో మూడు గంటలు పాటు పరీక్ష నిర్వహించారు. ఆదివారం రాతపరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్‌సీసీ వలన ఉపయోగాలు వంటివాటిపై విద్యార్థులకు వివరించారు. ఎన్‌సీసీ వలన విద్యార్థులలో దేశభక్తితో పాటు క్రమ శిక్షణకు మారుపేరుగా నిలుస్తారని మంచి విద్యార్థులుగా మనగలుతారని చెప్పారు. చీరాలలోని సెయింట్ ఆన్స్ స్కూలు, ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు, ఈపురుపాలెం, కొత్తపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలు, వేటపాలెం బండ్ల బాపయ్య హైస్కూలు, చినగంజాం, పందిళ్లపల్లి, నరసరావుపేటకు హైస్కూలుకు చెందిన 418 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పి. సురేష్ బాబు, మజ్ సుదేష్ కుమార్, ముఖేష్‌కుమార్, పి. రమేష్, షంషేర్ సింగ్, తిల్ కుమార్ లింబు, ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపీకృష్ణ, ఆయా పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

చీరాల అర్బన్: పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈనెల 13న భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. శనివారం పేరాలలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై స్మార్ట్ మీటరు, ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలను మోపుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులు పడుతుందని నాడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలను చేసిందని, నేడు అధికారంలోకి వచ్చాక అదే రీతిలో బిల్లులను ఏ విధంగా పెంచుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ విధానాన్ని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎస్.బాబూరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజ



మొక్క నాటుతున్న రోటరీ డిస్ట్రిక్ గవర్నర్

పర్చూరు (చినగంజాం): సేవా కార్యక్రమాల్లో పర్చూరు రోటరీ క్లబ్ ముందంజలో ఉందని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ కే శరత్‌చౌదరి కొనియాడారు. శుక్రవారం రాత్రి స్థానిక రోటరీ క్లబ్‌ని సందర్శించిన ఆయన నాగులపాలెంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల గురించి అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోటరీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సహాయ గవర్నర్ రమేష్ చంద్ర, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, కేఆర్‌కే ప్రసాద్, కొల్లా నరేంద్ర కుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, పాబోలు వెంకన్న, కోట హరిప్రసాద్, కోట శ్రీనివాసరావు, కాసా అశోక్‌కుమార్, కోడూరు సుబ్రహ్మణ్యచారి, కాల్వ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

చీరాల/చీరాల రూరల్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో పేరాల స్పోర్ట్స్ అండ్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ లెవల్ క్రికెట్ అండ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీ స్పోర్ట్స్ పాలసీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. అక్కాయపాలెం గ్రామంలో రూ.16.10 లక్షలతో నిర్మించిన ఏడు గోకులం షెడ్‌ను, చల్లారెడ్డిపాలెంలో రూ.44.55 లక్షలతో నిర్మించిన 19 గోకులం షెడ్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇంకొల్లు (చినగంజాం): నియోజక వర్గంలోని ఇంకొల్లు గ్రామంలో సుమారు రూ. 80 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రారంభించారు. ఇంకొల్లు బస్టాండ్‌లో పాలేరు రామకృష్ణ నిర్మించిన మదర్ ఫీడిగ్ రూమును, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పోలీస్ అవుట్ పోస్టును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ కే శరత్ చౌదరి, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: ధనుస్మాసం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కారంచేడు, స్వర్ణ, దగ్గుబాడు, ఆదిపూడి గ్రామాల్లోని ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రీతికరమైన గోదాదేవి ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక భజనలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

సంక్రాంతికి ఊరు వస్తూ..

- కారు, ట్రాక్టర్ ఢీ, వ్యక్తి మృతి



మృతుడు కారుసాల శ్రీనివాసరావు

సంతమాగులూరు (అద్దంకి): ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం గ్రామ శివార్లలో శనివారం జరిగింది. అందిన వివరాల మేరకు కొరిశపాడు మండలానికి చెందిన కే తేజ్ కుమార్ కుటుంబ సభ్యులు కారుసాల శ్రీనివాసరావు, ఆర్ అమృత, కే ఉమాదేవి పిల్లతో కలసి హైదరాబాదు నుంచి పండుగ సెలవులు కావడంతో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో వీరి కారు పుట్టావారిపాలెం అడ్డరోడ్డుకు సమీపంలోనికి రాగానే ముందు వెళ్తున్న కావలికి చెందిన సురేష్ ట్రాక్టర్‌ను తప్పించబోయి ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న కారుసాల శ్రీనివాసరావు (59)మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ సురేశ్‌తో సహా కారులో ఉన్న ఉమాదేవికి తీవ్రగాయాలు కాగా, అమృత, పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు నామ్ అంబులెన్స్‌లో ఓ ప్రైవేటు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు కేసు రాస్తుండగా..

మార్టూరు: జాతీయ రహదారిపై రాజుపాలెం సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. అద్దంకి మండలం మోదేపల్లి గ్రామానికి చెందిన భీమినేని అభిరామ్ విజయవాడలోని కే ఎల్ యూనివర్సిటీలో చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా అభిరామ్ తన చెల్లెలితో కలిసి బైక్‌పై విజయవాడ నుంచి మోదేపల్లికి బయలుదేరారు. శనివారం సాయంత్రం మార్టూరు సీఐ ఎం శేషగిరిరావు తమ సిబ్బందితో కలిసి డేగరమూడి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తూ కేసులు రాస్తున్నారు. అదే సమయంలో హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుకుంటూ వస్తున్న అభిరామ్ వాహనాన్ని పక్కకు తీయాలని పోలీసులు ఆదేశించారు. అభిరామ్ తన వాహనాన్ని పక్కకు తిప్పే క్రమంలో వెనుక నుంచి వేగంగా మరో వాహనం అదుపుతప్పి అభిరామ్ బైకును ఢీకొట్టడంతో అభిరామ్ రోడ్డుపై పడి గాయపడ్డాడు. కుడి మోకాలికి గాయమైన అభిరామ్‌ను పోలీసుల రోడ్డు పక్కకు తరలించి 108 సిబ్బందికి సమాచారం అందించారు. గాయపడిన అభిరామ్‌ను 108 సిబ్బంది చిలకలూరిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పోలీసులపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు



మృతదేహాన్ని వైద్యశాలకు తరలిస్తున్న రూరల్ ఎస్సై చంద్రశేఖర్ (ఫైల్)

చీరాల: పోలీసులు శక్తి వంచన లేకుండా సేవలు చేస్తున్నా కొందరు ఉద్దేశపూర్వంగా ఫొటోలు మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎండీ మోయిన్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ ఏఎస్సై మేడిద సంపూర్ణరావు మృతదేహాన్ని రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ మృతదేహాన్ని 108లో తరలించారన్నారు. కాని కొందరు మార్ఫింగ్ ఫొటోలు పెట్టి మృతదేహానికి కాలు తగిలినట్లుగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారన్నారు. తర్వాత వాస్తవ ఫొటోలు ఉన్నాయని, ఎస్సైను అగౌరవపరిచేలా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎవరు చేశారో ఈ చర్యపై త్వరలోనే బయటపెట్టి కఠిన శిక్ష విధిస్తామన్నారు.